క్లుప్తంగా

ఉమామహేశ్వరాలయాన్ని సందర్శించిన ఎస్ఐ



ఉమామహేశ్వర ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ కేశవ

కొత్తపల్లి: కార్తీక మాసం నేపథ్యంలో ఆదివారం సంగమేశ్వరం ఎగువ పుష్కరఘాట్ వద్ద ఉన్న ఉమామహేశ్వరాలయాన్ని ఎస్ఐ కేశవ సందర్శించారు. పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మతో కలిసి ఆలయ పరిసరాలను, కృష్ణానది జలాలను, పుష్కరఘాట్‌ను ఎస్ఐ పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా పురోహితులు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బ్రిడ్జిపై గుంత



బ్రిడ్జిపైన ఏర్పడిన గుంతను పరిశీలిస్తున్న వాహనదారులు

ఆత్మకూరు: ముష్టపల్లె నుంచి ఆత్మకూరుకు వెళ్లే దారిలో బ్రిడ్జి ఆదివారం కుంగిపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. బ్రిడ్జి నిర్మించి చాలా ఏళ్లు గడిచి పాతబడిపోయింది. నూతన బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అధికారులు పట్టించుకోవడం లేదని ముష్టపల్లి గ్రామస్తులు వాపోతున్నారు. వాహనదారులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా గొయ్యిలో పడే ప్రమాదం ఉంది. ఎలాంటి ప్రాణనష్టం జరగక ముందే ఆర్‌అండ్‌బీ అధికారులు నూతన బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

నందికొట్కూరు: మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్కూరు గ్రామంలో త్రైత సిద్ధాంతం భగవద్గీత గ్రంథం ప్రచారం ఆదివారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక రామచంద్రుడు, మునిదాసు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు పుల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, నాగ మద్దిలేటి, కుమారాచారి, సంజీవ, శేషన్న, పార్థసారధి, మనోజ్, లక్ష్మీనారాయణమ్మ, వరలక్ష్మి, నాగలచ్చమ్మ, రమణమ్మ, కృష్ణవేణి, లక్ష్మీదేవి, వెంకటరమణమ్మ, రాణెమ్మ, లక్ష్మీరూప, తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

సంగమేశ్వరంలో పూజలు

కొత్తపల్లి: మండలంలో వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రం సంగమేశ్వరంలోని ఉమామహేశ్వరాలయంలో కార్తీక మాసం రెండవ రోజు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు కృష్ణాజలాలతో అభిషేకం నిర్వహించారు. అదేవిధంగా కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతీ తదితర పూజలు చేశారు. అనంతరం ఆకాశ దీపోత్సం కార్యక్రమం నిర్వహించారు.

శ్రీశైల క్షేత్రానికి ప్రత్యేక బస్సులు

ఆత్మకూరు: కార్తీకమాసం సందర్భంగా ఆత్మకూరు డిపో ఆధ్వర్యంలో ప్రతి ఆది, సోమవారాల్లో శ్రీశైలం క్షేత్రానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆత్మకూరు ఆర్టీసీ డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ బి.కె.నాయక్ ఆదివారం తెలిపారు. కార్తీకమాసం సందర్భంగా శ్రీశైలం క్షేత్రానికి పెద్ద సంఖ్యలో భక్తులు వెళ్లే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అలాగే కర్నూలు డిపో నుంచి కూడా ప్రత్యేక బస్సులను నడిపే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఆత్మకూరు డిపో నుంచి నాలుగు బస్సు సర్వీసులను అదనంగా పంపించామని తెలిపారు.

జనవరి 5న హైందవ శంఖారావం

నంద్యాల(వ్యవసాయం): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందూ దేవాలయాల స్వయంప్రతిపత్తి లక్ష్యంగా హైందవ శంఖారావాన్ని జనవరి 5వ తేదీన విజయవాడలో లక్షలాది మందితో శక్తి ప్రదర్శన ఉద్యమం చేపట్టనున్నట్లు రాష్ట్ర కో కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా దేవాలయ పవిత్రతపై నెలకొన్న ఆందోళనకర పరిస్థితుల దృష్ట్యా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు, చంద్రమౌళీశ్వరరెడ్డి, కిశోర్, అభిరుచి మధు, నీలకంఠం, కాశీబట్ల శివప్రసాద్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు 'అపార్' కష్టాలు!

- ఆధార్‌లో మార్పులు, చేర్పులకు ఇక్కట్లు
- మాన్యువల్ బర్త్ సర్టిఫికెట్లు చెల్లవంటున్న కేంద్రాల నిర్వాహకులు
- సచివాలయం, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు



జనన ధ్రువీకరణ పత్రం కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన విద్యార్థులు,



గ్రామసచివాయానికి బర్త్ సర్టిఫికెట్ కోసం వచ్చిన తల్లిదండ్రులు

జూపాడుబంగ్లా: కేంద్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థికి ఓ యూనిక్ ఐడీ నంబర్ కేటాయింపునకు చర్యలు చేపట్టింది. విద్యార్థులకు సంబంధించి పూర్తి వివరాలను అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంటు రిజిస్ట్రేషన్) కోసం యూడైస్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. ఇందుకోసం ఆధార్‌లో ఏ చిన్న పొరపాటు ఉన్నా ఇబ్బందులు తప్పడం లేదు. దీని కోసం ఆధార్‌ను అప్‌డేట్ చేయాల్సి వస్తోంది. అయితే ఆధార్ కార్డులో చేర్పులు, మార్పుల కోసం అధికారులు మ్యానువల్‌గా ఇచ్చిన బర్త్ సర్టిఫికెట్లు చెల్లుబాటుకావని ఆధార్ కేంద్రాల నిర్వాహకులు పేర్కొనటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మండలంలో 4,830 మంది విద్యార్థులు

మండలంలో 38 ప్రభుత్వ పాఠశాలలుండగా 4,830 మంది విద్యార్థులు ఉన్నారు. ఆధార్ కార్డులో ఉన్న విద్యార్థి పేరు, పాఠశాల రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. అపార్ కోసం విద్యార్థి పుట్టిన తేదీ, పేరు ఓ అక్షరం తప్పులేకుండా ఉంటేనే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదవుతున్నాయి. ఏ చిన్న పొరపాటు ఉన్నా విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. విద్యార్థులు వారి పేర్లు, పుట్టినతేదీ వివరాలను స్కూల్ రికార్డుల్లో లేదా ఆధార్‌కార్డులో లేదా చేర్పులు, మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. 2014 కంటే ముందు ఆన్‌లైన్ వ్యవస్థ లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు మ్యానువల్‌గా పుట్టిన తేదీ సర్టిఫికెట్లను మంజూరు చేశారు. ఆధార్‌కార్డులో పుట్టిన తేదీ, పేరు, అడ్రస్సు చేర్పులు, మార్పులు చేసుకోవాలంటే విద్యార్థి పదో తరగతి ఒరిజనల్ మార్కుల లిస్టు ఉండాలి. పదో తరగతిలోపు విద్యను అభ్యసిస్తున్న వారైతే వారి పుట్టిన తేదీ మీసేవ, గ్రామ సచివాలయాల్లో జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి. అయితే ఆన్‌లైన్ వ్యవస్థ రాకముందు అధికారులు ఇచ్చిన బర్త్ సర్టిఫికెట్లు చెల్లవంటూ ఆధార్ కేంద్రాల నిర్వాహకులు వెనక్కి పంపుతున్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను ప్రశ్నిస్తున్నా వారి నుంచి సరైన సమాధానం రాకపోవటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

మ్యానువల్ సర్టిఫికెట్లు చెల్లవనడంతో తల్లిదండ్రులు తమ పిల్లల బర్త్ సర్టిఫికెట్ కోసం మళ్లీ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. అక్కడ అధికారులు పరిశీలించి తమ వద్ద రికార్డుల్లేవంటూ నో అవెలబుల్(ఫారం–10) సర్టిఫికెట్‌ను ఇచ్చి తహసీల్దార్ కార్యాలయానికి పంపుతున్నారు. అక్కడి అధికారులు రికార్డులు పరిశీలించి, ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయానికి పంపిస్తున్నారు. అక్కడి అధికారులు రికార్డులను పరిశీలించి తహసీల్దార్ కార్యాలయాలకు ప్రొసిడింగ్స్ ఇస్తున్నారు. ఆర్డీఓ ప్రొసిడింగ్స్ అనుసరించి తహసీల్దార్ జనన ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని సచివాలయ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. అప్పుడే డిజిటల్ బర్త్ సర్టిఫికెట్ విద్యార్థుల చేతికి అందుతుంది. ఈ తతంగం పూర్తయ్యేందుకు 20రోజులకు పైగానే సమయం పడుతుంది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సచివాలయాలు, తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఒక్కో సారి విద్యార్థుల ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్లలో అన్ని వివరాలు సక్రమంగా ఉన్నా పాఠశాలల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయకపోవడం వల్ల కూడా సమస్యలు నెలకొంటున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు ఆధార్‌కార్డులు సులువుగా చేర్పులు, మార్పులు జరిగేలా ఆదేశాలు జారీ చేయాలని విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్వయం ఉపాధిలో రాణించాలి

పాములపాడు: నిరుద్యోగులైన యువతీ, యువకులు ప్రభుత్వ ఉద్యోగాలకోసం వేచిచూడకుండా స్వయం ఉపాధిరంగాల్లో రాణించాలని సెంట్రల్ కస్టమ్స్ అధికారి వేల్పుల ఆనంద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పాములపాడులో శంకర్‌గౌడు మినీ ఇండస్ట్రీ(టీకప్పుడు, ప్లేట్లు తయారీ)ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధికోసం ఏర్పాటు చేసుకొనే వ్యాపార రంగంలో తనతో పాటు మరికొందరికి జీవనోపాధి కల్పించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహానందిరెడ్డి, ఎల్లగౌడు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా పోరు'ను జయప్రదం చేయండి

ఆత్మకూరు: అధిక ధరలు, విద్యుత్ ఎఫ్ఏపీపీసీ చార్జీల విధింపు, మహిళలపై అఘాయిత్యాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 15వ తేదీ వరకు జరిగే ప్రజాపోరును జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వి.యేసురత్నం, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో సీపీఎం పట్టణ కమిటీ సమావేశాన్ని పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలు, విద్యుత్ చార్జీలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, ఇసుక కొరతతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆత్మకూరు పట్టణంలో జరిగే ప్రజా పోరులో ప్రజలు, నిరుద్యోగులు, మహిళలు, మేధావులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం పట్టణ నాయకులు ఎస్.స్వాములు, ఎ.సురేంద్ర, జి.నాగేశ్వరరావు, షేక్‌ఇస్మాయిల్, సద్దాంహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో కార్తీక సందడి



విద్యుత్ కాంతులలో వెలిగిపోతున్న మహానంది రాజగోపురం, మండపాలు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



సామూహిక రుద్రాభిషేకంలో భక్తులు

మహానంది: కార్తీకమాసం, ఆదివారం కావడంతో మహానంది ఆలయం భక్తులతో కళకళలాడింది. వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులరద్దీకి అనుగుణంగా ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏఈఓ ఎరమల మధు, ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధర్‌రెడ్డి ఏర్పాట్లు చేయించారు. స్థానిక అలంకార మండపంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, ఆంజనేయశర్మలు సామూహిక అభిషేకాలు నిర్వహింపజేశారు. పలు ప్రాంతాల భక్తులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించుకుని భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.

మహానందికి కార్తీక కాంతులు

మహానంది: కార్తీకమాసం సందర్భంగా మహానంది క్షేత్రాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి గర్భాలయ గోపురాలతో పాటు రాజగోపురం, సుపథం మండపాలకు ఏర్పాటు చేసిన విద్యుత్‌దీప కాంతులు భక్తులను ఆకట్టుకున్నాయి. దీంతో కార్తీక శోభను సంతరించుకుంది.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



కృష్ణానదిలో బోటులో ప్రయాణిస్తూ ఘాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ

శ్రీశైలంప్రాజెక్ట్: కార్తీకమాసంలో వివిధ ప్రాంతాల నుంచి శ్రీశైలానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సున్నిపెంట పోలీస్ సిబ్బందిని డీఎస్పీ రామాంజినాయక్ ఆదేశించారు. ఆదివారం ఆయన సీఐ జి.చంద్రబాబు, సిబ్బందితో కలిసి శ్రీశైలండ్యాం, వ్యూపాయింట్, లింగాలగట్టు లోలెవెల్, హైలెవెల్ ఘాట్లను పరిశీలించారు. కృష్ణానదిలో పర్యటించారు. భక్తుల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్‌ను నియంత్రించాలని, కృష్ణానది ఘాట్ల వద్ద నిరంతర నిఘా ఉంచి భక్తులకు నదిలో ప్రమాదాలు జరుగకుండా చూడాలని టూటౌన్ పోలీసులకు సూచించారు. కార్తీక మాసాంతం వరకు ఇద్దరు ఎస్ఐలు, ఐదుగురు ఏఎస్ఐలు, నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, ఏడుగురు కానిస్టేబుళు, ఇద్దరు బ్లూక్యాట్ పోలీసులు రౌండ్ ద క్లాక్ పనిచేయాలని ఆదేశించారు.

కొలనుభారతి క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలి



ఆలయ సిబ్బంది, పురోహితులతో మాట్లాడుతున్న కాకనూరు శారదాపీఠం పీఠాధిపతి

కొత్తపల్లి: రాష్ట్రంలో ఎంతో పవిత్రమైన ఏకైక సరస్వతి ఆలయంగా పేరుగాంచిన కొలనుభారతి దేవి క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేయాలని కాకనూరు శారదాపీఠం పీఠాధిపతి శివ యోగేంద్ర సరస్వతి అన్నారు. ఆదివారం ఆయన కొలనుభారతిదేవి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్ర పవిత్రత, ప్రతిష్టతకు భంగం కలుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులకు సూచించారు. క్షేత్ర పరిధిలో అనధికార పూజలను అడ్డుకోవాలన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, పూజల పేరుతో అధిక మొత్తం వసూలు చేయరాదన్నారు. ఆయన వెంట విశ్వహిందూ పరిషత్ నాయకులు వాసుదేవ రెడ్డి ఉన్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి



భవనాశి సోదరులను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

వెలుగోడు: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు భవనాశి నాగమహేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీ లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్మించిన కళ్యాణ మండపాన్ని కాశీ అన్నపూర్ణ వాసవి ఆర్యవైశ్య వద్ధాశ్రమం అధ్యక్షుడు, నంద్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి శ్రీనివాస్‌లతో కలసి ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బళ్లాని వెంకట సత్యనారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ మండలంలో శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దాతల సహకారంతో నిర్మించడం సంతోషకరమన్నారు. బళ్లాని వెంకట సత్యనారాయణతో పాటు కమిటీ సభ్యులు కళ్యాణమండపం నిర్మించాలని కోరగా.. తమ వంతు సహాయంగా తల్లిదండ్రుల జ్ఞాపకార్థకం కళ్యాణ మండపం నిర్మించడం జరిగిందన్నారు. అనంతరం భవనాశి కుటుంబ సభ్యులను మండల ఆర్యవైశ్యులు ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్యులు లాలం నరసయ్యను జిల్లా అధ్యక్షులు ఘనంగా సన్మానించారు. చిన్నారుల కోలాటంతో సందడి నెలకొంది. కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు బచ్చు రాము, తాళ్లూరి సంజీవరాయ ప్రసాద్, లాలం నాగార్జున, నాగేళ్ల సుబ్రహ్మణ్యం, బొగ్గరపు లక్ష్మీనారాయణ, తలం రామ్మోహన్, శ్రీరామ్ నాగేశ్వరరావు, తూళ్లూరి రవిప్రసాద్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ఎస్‌టీటీఎఫ్ (షెడ్యూల్, ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్) కార్యాలయంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు గోర్ల సుధాకర్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఆదివారం నిర్వహించిన సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని, 12వ పీఆర్సీ నియమించాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా కేశాలునాయక్, జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడిగా రాము, వైస్ ప్రెసిడెంట్ దేవేంద్రుడు, రాంబాలాజీనాయక్, తిక్కస్వామి, విజయ్‌కుమార్, కోశాధికారి ప్రభాకర్, అడిషనల్ సెక్రటరీగా పక్కిరయ్య, సెక్రటరీగా రవీంద్రబాబు, నాగలక్ష్మి, శోభారాణి, రమేష్‌నాయక్, చంద్రమోహన్‌ను ఎన్నుకున్నట్లు వివరించారు.

పంట బీమా ప్రీమియం చెల్లించాలి



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ

వెలుగోడు: రైతులు పంటల బీమా పరిహారం పొందాలంటే బీమా ప్రీమియం చెల్లించాలని ఏవో పవన్ కుమార్ సూచించారు. మండలంలోని వేల్పనూరు గ్రామంలో సాగు చేసిన వరి పంటను ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు, అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితులతో పంటలు నష్టపోయినపుడు పరిహారం అందుకోవాలంటే పంటల బీమా చేయించుకోవాలన్నారు. వ్యవసాయ రుణాలు తీసుకోని రైతులు, కౌలు రైతులు గ్రామ సచివాలయాలు, ఉమ్మడి సేవా కేంద్రాల ద్వారా పంటల బీమా ప్రీమియం చెల్లించవచ్చన్నారు. డిసెంబర్ 15లోగా పంట బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఎటితో పాటు వ్యవసాయ విస్తరణ సిబ్బంది మహేంద్ర పలువు రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్రప్ప

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతి 30 శాతం వెంటనే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అయన మాట్లాడుతూ ఎన్ఎంఆర్, పార్ట్ టైం, ఫుల్ టైం, కంటింజెంట్ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ వయస్సు దగ్గరకు వచ్చినా ఇంత వరకు సర్వీసు క్రమబద్ధీకరించలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ బకాయిలు, సరెండర్ లీవ్, వైద్య విద్య ఖర్చుల అవసరాల నిమిత్తం పెట్టుకున్న ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ రుణాలు తక్షణమే మంజూరు చేయాలని, ఆరోగ్యశ్రీ పథకం రూ.5 లక్షలకు పెంచాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి తిరుపాలయ్య, శ్రీహరి, కోశాధికారి శ్రీనివాసులు, సిటీ అధ్యక్షులు సత్యం, మహిళా అధ్యక్షురాలు ప్రభావతమ్మ, లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వెలుగోడు: పట్టణంలోని స్టార్ యూత్ అసోసియేషన్, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో ప్రముఖ కెడం ప్రసాద్ హాస్పిటల్ నుంచి బీపీ, షుగర్ వ్యాధి నిపుణులు కే దుర్గాప్రసాద్, స్త్రీ, ప్రసూతి వ్యాధి నిపుణులు, లాప్రోస్కోపీ, సంతాన సాఫల్య చికిత్స వైద్యురాలు ఎం హిందుమతి పేషెంట్లకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో సుమారు 100 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సేవలు అందించిన డాక్టర్లను స్టార్ట్ యూత్ అసోసియేషన్ సీఈఓ హసన్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రామలింగారెడ్డి సన్మానించారు. శిబిరంలో పూర్వ విద్యార్థులు జయరాం రెడ్డి, శ్రీనివాసులు, మక్బూల్ బాషా, నసురుల్లా ఖాన్, సుల్తాన్ మోహిద్దీన్ పాల్గొన్నారు.

ఫారం భూముల్లో కలుపు మొక్కలు



ఫారం భూముల్లో సాగుచేసిన కందిపంటలోని అంతర్‌పంటను తలపిస్తున్న కలుపు



పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయిన తంగడంచ ఫారంలో సాగుచేసిన కందిపంట

జూపాడుబంగ్లా: వ్యవసాయశాఖ అధికారులనగానే విత్తనాలు ఎప్పుడు విత్తుకోవాలి, ఎలా విత్తుకోవాలి, విత్తనశుద్ధి, పంటలో కలుపుతీత, రసాయనిక ఎరువుల వాడకం, క్రిమిసంహారక మందుల పిచికారీ వంటివాటిపై రైతులకు సలహాలు, సూచనలు ఇస్తుంటారు. అలాంటి వ్యవసాయ అధికారులు సాగుచేసే పంటలు ఏపుగా ఉండి, పొలంలో కలుపు లేకుండా అధిక దిగుబడులు సాధించేలా ఉంటాయని ఎవ్వరైనా చెప్పేస్తారు. అయితే తంగడంచ విత్తనోత్పత్తిక్షేత్రంలో వ్యవసాయ అధికారులు 210 ఎకరాల్లో సాగుచేసిన ఎల్ఆర్‌జీ–105రకం కందిపంట అందుకు విరుద్ధంగా ఉంది. కంది పంటల్లో ఏపుగా పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలతో నిండి ఇది వ్యవసాయ అధికారులు సాగుచేసిన పంటేనా..అన్నట్లుగా ఉంది. అధికారులు సాగు చేసిన పంటల కంటే తమ పొలాలే కలుపు మొక్కలు, చెత్తాచెదారం, గడ్డి లేకుండా శుభ్రంగా ఉన్నాయని రైతులు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా 210 ఎకరాల్లో సాగుచేసిన కంది పంటలో కలుపు తీసేందుకు గాను ఒక్కో వ్యవసాయ కూలీకి రూ.510ల చొప్పున రోజుకు 500 కూలీలు పైబడి సుమారు పక్షం రోజులపాటు వెచ్చించినట్లు అధికారులు పేర్కొనడం విడ్డూరంగా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

తెలుగుగంగ కాల్వకు 13వేల క్యూసెక్కులు



పోతిరెడ్డిపాడు నుంచి విడుదలవుతున్న నీరు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు దిగువన ఉన్న రిజర్వాయర్లు గరిష్టస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను తగ్గించినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం శ్రీశైలం జలాశయంలో 880.40అడుగుల నీటి మట్టం ఉండగా పోతిరెడ్డిపాడు వద్ద 879.40అడుగులు నమోదైనట్లు తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ఆరుగేట్ల నుంచి నీటివిడుదలను 15వేల క్యూసెక్కులకు తగ్గించినట్లు తెలిపారు. బానకచర్ల నీటి నియంత్రణ వద్ద తెలుగుగంగ కాల్వకు 13వేల క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ కాల్వ, జీఎన్ఎస్ఎస్ (ఎస్సార్బీసీ) కాల్వలకు వెయ్యి క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు.

నిప్పులవాగుకు 1,009క్యూసెక్కులు

లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 1,009క్యూసెక్కుల సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2500క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 1,514క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. ఈ నీటిలో 1,009క్యూసెక్కులు నిప్పులవాగుకు, 450క్యూసెక్కులు తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు, 55క్యూసెక్కులునీటిని అలగనూరు రిజర్వాయర్ కాల్వకు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

పాములపాడు: లాకిన్స్‌లా నుంచి ఏబీఆర్ కాల్వకు 55క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. కేసీ కాల్వ 120కిలోమీటరు లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 1,009క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సుంకేసుల డ్యాం నుంచి 2,500క్యూసెక్కులు లాకిన్స్‌లాకు చేరుతుందన్నారు. తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 450క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వకు 55క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల చేస్తున్నట్లు వివరించారు.